క్లుప్తంగా

హౌసింగ్ బోర్డు వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పశ్చిమ హౌసింగ్ బోర్డు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చీటి పాండురంగారావు, ప్రధాన కార్యదర్శిగా బి.గోపాలకృష్ణ, కోశాధికారిగా చెట్కూరి మహిపాల్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు సుతారి అంజయ్య, యెంబరి లింగం, తిరుపతిరెడ్డి, రమేష్, బాల్‌రాజ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మీసానిపల్లిలో బోరుబావి తవ్వకం



ఎల్లారెడ్డిరూరల్: మీసాన్‌పల్లిలో నీటి ఎద్దడి నివారణకు బోరు బావిని తవ్వించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. గ్రామంలో నీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే మదన్‌మోహన్ బోరు వేయించాలని సూచించడంతో బోరుబావిని తవ్వించినట్లు వారు తెలిపారు. నాయకులు వెంకట్రాంరెడ్డి, కుడుముల సత్యనారాయణ, బోండ్ల సాయిలు, సామెల్ తదితరులున్నారు.

తూము కాలువ ధ్వంసం

భిక్కనూరు: జంగంపల్లి గ్రామానికి చెందిన పెద్ద చెరు వు తూము కాలువ ధ్వంసమైంది. ఆదివారం ఈ విషయాన్ని గమనించిన రైతులు నీటి పారుదల శాఖాధికారులకు సమాచారం అందించారు. తూము ద్వారా విడుదలయ్యే నీరు ఈ కాలువ ద్వారా పంటపొలాలకు చేరుతుందని, కాలువ ఒక్క దగ్గర ధ్వంసం అవడం వల్ల నీరు వృథా అవుతుందని వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మద్దెల బాగయ్య సూచించారు. తిమ్మోజీవాడి గ్రామంలో పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నాయకులు అశోక్ రావు, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయిలో రక్తదాన శిబిరం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 30 మంది యువకులు ఈ శిబిరంలో పాల్గొన్ని రక్తాన్ని దానం చేశారు. తాడ్వాయికి చెందిన ఉపాధ్యాయుడు రాజాగౌడ్ రక్తదానం చేసిన యువకులకు భగవద్గీత పుస్తకాలను బహూకరించారు. మాజీ సర్పంచ్ సంజీవులు, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, ఫౌండేషన్ నిర్వాహకులు గొల్ల నవీన్, ఉపాధ్యాయుడు రాజాగౌడ్, ఎన్‌వైసీ అధ్యక్షుడు సతీష్, కానిస్టేబుల్ రాములు, బీజేపీ నేతలు సంతోష్‌రెడ్డి, వెంకట్‌రావు, యాదగిరి పాల్గొన్నారు.

శివ దీక్షలు ప్రారంభం



బిచ్కుంద(జుక్కల్): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు శివ దీక్షలు వేసుకుంటున్నారు. మండలంలోని ఖద్గాం మహారాజ్ మల్లికార్జున్ స్వామి చేతుల మీదుగా ఆదివారం శివ స్వాములు దీక్ష మాలలు వేసుకున్నారు. 41 రోజులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి శివరాత్రి రోజున దీక్షమాలను తీసివేస్తారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

మాచారెడ్డి: చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధికి ఆదివారం హైదరాబాద్‌కు చెందిన గడీల శ్రీనివాస్, దివ్య రూ.6 వేలు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా అర్చకులు దాతలకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈవో శ్రీధర్, అర్చకులు శ్రీనివాసచారి, నర్సింహచారి, పరంధామచారి, సంజీవచార్యులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



కామారెడ్డి అర్బన్: గర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం గర్గుల్ ప్రీమియర్ లీగ్ నోబుల్ నైట్స్ సీజన్-3 క్రికెట్ పోటీలను మాజీ సర్పంచ్ రవితేజ గౌడ్ టాస్ వేసి ప్రారంభించారు. ఈనెల 15వరకు పోటీలు జరుగుతాయని పీఈటీ ఎస్.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. క్రికెట్‌లో ఆరు జట్లు పాల్గొంటున్నట్టు చెప్పారు.

శ్మశానవాటికల్లో సమస్యల తిష్ట



సదాశివనగర్ శ్మశానవాటిక వద్ద నిరుపయోగంగా మారిన బోరు

ఈ చిత్రంలో కనిపిస్తున్న బోరు బావి సదాశివనగర్ శ్మశానవాటికలో ఉంది. ఈ బోరు మరమ్మతులకు నోచుకోక నెలలు గడుస్తోంది. దీంతో శ్మశా నవాటిక వద్ద నీటి చుక్కలేని దుస్థితి నెలకొంది. అంత్యక్రియలకు వచ్చిన బంధువులు, గ్రామస్తులు వ్యవసాయ బోరు బావులను ఆశ్రయిస్తున్నారు. దీనికి తోడు అక్కడే ఉన్న స్నానపు గదుల తలుపులు, కిటికీ లు ధ్వంసం కావడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.



భూంపల్లి శ్మశానవాటికలోని స్నానపు గదుల పరిస్థితి

ఈ చిత్రంలో కనిపిస్తున్న స్నానపు గది భూంపల్లి శ్మశానవాటికలోది. ఉపయోగంలో లేకపోవడంలో పొదల మాటున ఉండిపోయింది. పైప్ లైన్‌లు ధ్వంసమయ్యాయి. తలుపులు, కిటికీలు తుప్పపట్టిపోయాయి. నీటి వసతి లేదు. కరెంటు కోసం వేసిన విద్యుత్ స్తంభాలకు కనెక్షన్ లేక దిష్టిబొమ్మల్లా మారాయి. ఈ రెండు గ్రామాల్లోనే కాకుండా సదాశివనగర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

కనీస మౌలిక వసతులు కరువు

- విద్యుత్ సరఫరా, నీటి సదుపాయం లేక ఇబ్బందులు
- గదుల తలుపులు, తాళాలు ధ్వంసం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న స్నానపు గదులు
- నిరుపయోగంగా బోర్లు.. పట్టించుకోని అధికారులు

ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శ్మశానవాటికలు నిర్మించింది. అన్నింట్లోనూ మౌలిక వసతులు కల్పించినా.. కొన్ని చోట్ల ఆకతాయిల కారణంగా శ్మశానవాటికల్లో నిర్మించిన గదులు, ఇతర సామగ్రి పాడైపోతున్నాయి. ఉన్న వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అంత్యక్రియల సమయంలో సరైన సౌకర్యాలు లేక మృతుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారు.

సదాశివనగర్(ఎల్లారెడ్డి): గ్రామీణ ప్రాంతాల్లో అన్ని వసతులు కల్పించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, మంకీఫుడ్‌కోర్టులను ఏర్పాటు చేసింది. వీటి అమలు ప్రారంభంలో బాగానే ఉన్నప్పటికి



భూంపల్లిలో కనెక్షన్‌కు నోచుకోని విద్యుత్ స్తంభం



తుక్కోజీవాడిలో మరుగుదొడ్డి దుస్థితి..

రాను రాను వాటికి కనీస వసతులు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారుల పర్యవేక్షణ కొరవడిందనటానికి నిదర్శంగా నిలుస్తున్నాయి. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టారు. కానీ వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైనట్లు స్పష్టమౌతుంది. కొన్ని గ్రామాల్లో తవ్విన బోర్లు దిష్టిబొమ్మల్లా ఉన్నాయి. మరికొన్ని గ్రామాల్లో బోరు మోటార్లు చెడిపోవడంతో పట్టించుకోక నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే అంత్యక్రియల నిమిత్తం ప్రత్యేక ట్యాంకర్లను ఏర్పాటు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. కనీసం కాళ్లు కడుక్కోవడానికి కూడా శ్మశానవాటికల వద్ద నీళ్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. నిర్మించిన నీటి తొట్టిలు నిరుపయోగంగా మారాయి.

కరెంటు సరఫరా లేక..

గ్రామాల్లో శ్మశానవాటికల వద్ద ఇప్పటి వరకు కరెంటు సదుపాయం కల్పించకపోవడంతో చిమ్మ చీకట్లలోనే అంత్యక్రియలను నిర్వహించాల్సి వస్తోంది. కనీసం విద్యుత్ దీపాలు అమర్చడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కరెంటు సరఫరా ఉన్న గ్రామాల్లో సదుపాయాలు లేవు. స్తంభం ఉంటే బల్బులు ఉండవు.. బల్బులు ఉంటే కరెంటు ఉండని పరిస్థితి. శ్మశానవాటికల వద్ద నిర్మించిన స్నానపు గదుల తలుపులు, కిటికీలు నాణ్యతగా లేకపోవడంతో చెడిపోయాయి. గదులు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.

అధికారులు పట్టించుకోవాలె..



శ్మశానవాటికల వద్ద వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి వసతి తప్పకుండా ఉండాలి. నీటి వసతి లేక దగ్గర్లో ఉన్న బోర్లను ఆశ్రయించాల్సి వస్తోంది. అధికారులు చర్యలు తీసుకొని అన్ని వసతులు కల్పించాలి. –గంగాధర్, భూంపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



శ్మశానవాటికల వద్ద సరైన వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తోంది. పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రత్యేకాధికారుల జాడ లేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించారే తప్ప వాటిపైన పర్యవేక్షణ లేకుండా పోయింది. నిరుపయోగంగా మారుతున్నాయి.

–సుధాకర్ రెడ్డి, తిర్మన్‌పల్లి

నీటి వసతి లేదు



శ్మశానవాటిక వద్ద కనీసం నీటి వసతి లేదు. మండల కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఇక ఇతర గ్రామాల్లో పరిస్థితి చెప్పలేం. కరెంటు సరఫరా లేదు. నిర్మించిన స్నానపు గదులు పనికి రాకుండా పోయాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయి.

–ఎస్.బాలయ్య, సదాశివనగర్

సమస్యల పరిష్కారానికి కృషి



శ్మశానవాటికల్లో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి రాలేదు. పరిశీలించి వసతుల కల్పనకు కృషి చేస్తా. శ్మశానవాటికల వద్ద తప్పకుండా నీటి వసతి, కరెంటు సదుపాయం కల్పిస్తాం.

– సంతోష్‌కుమార్, ఎంపీడీవో, సదాశివనగర్

ఎస్‌జీటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్



మున్నూరుకాపు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తూ..

కామారెడ్డి టౌన్: సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయ సంఘం (ఎస్‌జీటీయూ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సోమిశెట్టి రాములు, ప్రధాన కార్యదర్శి పుల్లూరి స్వామి, నాయకులు రాజేందర్, భాస్కరరావు, బాబయ్య, ప్రమీల, సంధ్యారాణి, స్వరూపారాణి, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి అశోక్‌నగర్ కాలనీ మున్నూరుకాపు సంఘం క్యాలెండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంటకరమణ రెడ్డి ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ రావు, కాలనీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆకుల గంగారాం, పి.అంజయ్య, ప్రతినిధులు గోప్ప నర్సింలు, కుంటి అంజనేయులు, ముదాం బలరామ్, ముదాం పెంటయ్య పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

నిజాంసాగర్(జుక్కల్): స్థానిక సంస్థల ఎన్నికలకు నేతలందరూ కలిసికట్టుగా ముందుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఆదివారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని, సర్వలో బోరు మోటార్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్థానిక ఎన్నికల నాటికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు పదవులు దక్కుతాయని చెప్పారు. ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమాజ సేవ, పార్టీ కార్యక్రమాలకు తన సేవలను ఉపయోగించు



మహమ్మద్‌నగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నేత పైడి ఎల్లారెడ్డి

కోవాలని కోరారు. బీజేపీ మహమ్మద్‌నగర్ అధ్యక్షుడు పోలీస్ రాజు, ప్రముఖ వ్యాపారవేత్త కొండ అనిల్ గుప్తా, బీజేపీ నాయకులు రాంప్రసాద్ గుప్తా, రవి గౌడ్, సతీష్, సాయిబాబా ఉన్నారు.

స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి): యువత స్వామి వివేకానంద అడుగుజాడల్లో నడవాలని ఛత్రపతి శివాజీ యువసేన అఖండ భారత్ ప్రధాన కార్యదర్శి జైలు యోగేశ్ ప్రభుజీ అన్నారు. ఆదివారం యువజన దినోత్సవం సందర్భంగా లింగంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన స్వామి విగ్రహాన్ని ఆవిష్కరించారు. శాస్త్రవేత్త, బీజేపీ నేత పైడి ఎల్లారెడ్డి, కృష్ణ మందిరం పీఠాధిపతి మచాతలే బాబా, కన్హైరాజ్ బాబా, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని వేంకటేశ్వరాలయంలో ఆదివారం గోదాదేవి, వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గోదాదేవి, వేంకటేశ్వరస్వామి విగ్రహాలను అందంగా అలంకరించారు. అనంతరం వేదబ్రాహ్మణులు భక్తిశ్రద్ధలతో కల్యాణాన్ని జరిపించారు. హాజరైన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నేడు గోదారంగనాథస్వామి కల్యాణోత్సవం

కామారెడ్డి అర్బన్: జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్ గోదారంగనాథ స్వామి ఆలయంలో సోమవారం ఉదయం 9.30 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు చాత్తాద శ్రీవైష్ణవ సంఘం అధ్యక్షుడు గుమ్మల రవి, ప్రధాన కార్యదర్శి పి.నరేందర్, శ్రీరాం సత్యం తెలిపారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కల్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఆదర్శనీయుడు స్వామి వివేకానంద



రామారెడ్డి: వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, మాతృశక్తి ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలు

స్వామి వివేకానంద జయంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆయన అందరికీ ఆదర్శనీయుడని అన్నారు. యువతను ప్రభావితం చేసిన ఆయన ఉపన్యాసాలు గుర్తు చేసుకున్నారు. వివేకానందుని ఆశయ సాధనకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్



వీహెచ్‌పీ ఆధ్వర్యంలో..



లింగంపేటలో ..



పాల్వంచ మండల కేంద్రంలో..



జిల్లా కేంద్రంలో..



తిప్పారం తండాలో..



దోమకొండలో..



బిచ్కుందలో..

పెన్సిల్ లెడ్‌పై వివేకానందుడు



బాన్సువాడ రూరల్: సోమేశ్వర్ గ్రామానికి చెందిన మైక్రో ఆర్టిస్ట్ మోహన్ పెన్సిల్ లెడ్‌పై వివేకానందుడి చిత్రాన్ని చెక్కి ఔరా అనిపించారు. సూక్ష్మకళల పై ఆసక్తితో పెన్సిల్, చాక్‌పీస్, సబ్బుబిల్లలపై వివిధ రకాల కళాకృతులు తీర్చిదిద్దుతున్న మోహన్‌ను గ్రామస్తులు అభినందించారు.



నస్రుల్లాబాద్‌లో .. బీజేపీ నాయకులు



బోర్లంక్యాంపులో..



కృష్ణాజివాడిలో ..



భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో హిందూజాగృతి ఆధ్వర్యంలో..



భిక్కనూర్‌లో నివాళులర్పిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



భిక్కనూరు: ఏబీవీపీ ఆధ్వర్యంలో..

సంక్షిప్తం

మత్తడిపోచమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ అభివృద్ధి కోసం ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం విరాళాలు సేకరించినట్లు గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు శంకర్‌గౌడ్, అశోక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా లింగంపేటకు చెందిన మేరు సంఘం రూ.11,000, రాజారాం సంజీవులు రూ. 11,511 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దుర్గయ్య, లక్ష్మీనారాయణ, ప్రసాద్, శంకర్, అంజయ్య, హరిబాబు, మారుతి, ఎల్లమయ్య, ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మైనార్టీ నాయకుడు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు ఫతియోద్దీన్ ఆదివారం తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి కృషి చేయాలని, అన్ని వర్గాలతో మమేకమై పార్టీ విజయానికి దోహదపడాలని సూచించినట్లు తెలిపారు.

అంగన్‌వాడీకేంద్రాలకు కుర్చీల వితరణ



మాచారెడ్డి: పాల్వంచ మండలంలోని ఫరీదుపేట గ్రామంలో ఉన్న నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలకు కలిపి 80 కుర్చీలను అదే గ్రామానికి చెందిన తగిరంచ లింగారెడ్డి అందజేశారు. తన తండ్రి రాజారెడ్డి జ్ఞాపకార్థం కుర్చీలను అందించినట్టు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాల్వంచ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.శంకర్, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, వనజ, చంద్రకళ, ఆశావర్కర్లు లక్ష్మి, తదితరులున్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



లింగంపేట(ఎల్లారెడ్డి): కొర్పోల్, లింగంపేట గ్రామాల్లో ఆదివారం సీసీ రోడ్ల పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ ప్రారంభించారు. కొర్పోల్ గ్రామంలో రూ. 5 లక్షలు, లింగంపేటలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా గోపాల్‌పేటలో ఆదివారం బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోపాల్‌పేటలోని పెట్రోల్ బంకు నుంచి ఎస్సీ బాలుర వసతిగృహం వరకు ఏర్పాటు చేస్తున్న సర్వీస్ రోడ్డుపై బీటీ పనులు చేపట్టారు.